ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి ములుగు
5
ఆదివారం 18 ఆగస్టు 2024



తయ్యం.. తత్తయ్యం..

..హే.. బాపు బంజారులం





- చెక్కు చెదరని లంబాడాల కట్టు, బొట్టు
- నాడు తండాల సంప్రదాయం.. నేడిదే ట్రెండ్

Sunday SPECIAL

సమాజంలో లంబాడా మహిళలది భిన్నమైన వస్త్రధారణ.. ఆ ప్రత్యేకమైన అలంకరణే వారి సౌందర్యం. రంగురంగుల అద్దాలు పొదిగిన రవికలు.. అవే రంగులు.. అద్దాలతో ఉన్న దుప్పట్టా.. మణికట్టు నుంచి మోచేతివరకు మందపాటి తెలుపురంగు గాజులు, చెవులకు పెద్దపెద్ద వెండి దిద్దులు.. మెడలో వెండి గొలుసులు, పాత రూపాయి నాణేలతో చేసిన హారాలు, కాళ్లకు వెండి కడియాలు, గజ్జెలు ధరించడం వారి సంప్రదాయం. అదే వారి సోయగం. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలగలిసిన వేషధారణలో ఆ మహిళలు నడిచొస్తున్నా.. పాదం కదిపి జానపదానికి నృత్యం చేసినా ఆ గజ్జెల సవ్వడి వినసొంపుగా ఉంటుంది. ఇదంతా ఒకప్పటి మాట. ఆధునిక పోకడల్లో క్రమంగా ఈ వేషధారణలో కొంత మార్పులొచ్చాయి. ఈ తరం లంబాడా మహిళలు కూడా ఈ వస్త్రధారణపట్ల ఆసక్తి చూపని పరిస్థితులు. కానీ ట్రెండ్ మారుతోంది. మళ్లీ లంబాడా వస్త్రధారణవైపు దృష్టి మళ్లుతోంది. 'పాతకు సలాం.. ఇదే మా నయా ట్రెండ్' అంటూ గిరిజన మహిళలు తమ సంప్రదాయ దుస్తులు ధరించడం.. వేడుకలకు హాజరవడం కనిపిస్తోంది. అంతేకాదు ఫ్యాషన్ షోలతో పాటు వేడుకల్లో ఈ అలంకరణలు జిగేల్ మంటున్నాయి.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్



7

మహదేవపూర్‌లో

బంద్ విజయవంతం

మహదేవపూర్, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం తలపెట్టిన బంద్ మహదేవపూర్ మండల కేంద్రంలో విజయవంతమైంది. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలను స్వచ్ఛందంగా మూసి ఉంచారు. షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాలు, హోటల్స్ యాజమాన్యాలు బంద్‌ను పాటించాయి.

డాక్టర్ల కన్నెర్ర

సర్కారు ఆస్పత్రుల్లో ఓపీకి అంతరాయం

విధులు బహిష్కరించి నిరసనకు దిగిన వైద్యులు

ఎమర్జెన్సీ తప్ప అన్ని సేవలు బంద్

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 17: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఉదంతంపై వైద్యులు కన్నెర్రజేశారు. శనివారం వైద్య సేవలను నిలిపివేసి నిరసనకు దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎమర్జెన్సీ తప్ప అన్ని వైద్య సేవలకు మధ్యాహ్నం వరకు అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లిలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఆస్పత్రి నుంచి మంజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరిటెండెంట్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

ములుగులో డాక్టర్ల ర్యాలీ

ములుగు కలెక్టరేట్ : కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా ములుగులో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, జూనియర్ డాక్టర్లు, సిబ్బంది బ్యానర్లు, ప్లకార్డులు చేబూని ఏరియా ఆస్పత్రి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ జగదీశ్వర్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య విద్యార్థులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని,



ములుగులోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా నిరసన తెలుపుతున్న వైద్యులు



నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని, వైద్యులపై దాడులను అరికట్టేవిధంగా చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, వైద్యులు పూజారి రఘు, వంశీకృష్ణ, ప్రశాంత్‌నాయక్, విజయలక్ష్మి, రాజా, లిఖిత, సుస్మిత, ప్రదీప్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, జూనియర్, పీజీ డాక్టర్లు పాల్గొన్నారు.



7

నగరంలో కీర్తిసురేష్

'జోస్ అలుక్కాస్' ప్రారంభానికి హాజరు

బాలనటిగా.. ఆ తర్వాత హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని.. తెలుగుతో పాటు పలు భాషల్లో నటిస్తూ అలరిస్తున్న 'మహానటి' కీర్తిసురేష్ శనివారం నగరంలో సందడి చేశారు. హనుమకొండలోని నక్కలగుట్టలో జోస్ అలుక్కాస్ బంగారు ఆభరణాల షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి, జోస్‌అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కా పాల్ జే, అలుక్కా జాన్ అలుక్కా తదితరులు పాల్గొన్నారు.

- కాళోజీ జంక్షన్

కాటారం టు మణిపూర్

58 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ బలగాల తరలింపు

నేడు 200 మందికి పైగా అధికారులు, జవాన్లకు స్థానచలనం



కాటారంలో సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు

కాటారం, ఆగస్టు 17: సీఆర్‌పీఎఫ్ బలగాలు నుంచి తరలివెళ్లనున్నాయి. 22 ఏళ్లుగా క్యాంపులు ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహిస్తున్న బెటాలియన్ సభ్యులు ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అవుతున్నారు. మావోయిస్టు ప్రాబల్యప్రాంతమైన కాటారం సబ్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు వీఐపీల పర్యటనల సందర్భంగా తనిఖీలు, సోదాలు చేస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆదివారం మణిపూర్‌కు తరలివెళ్లనున్నాయి. గతంలోలా కాటారం సబ్ డివిజన్‌లో మావోయిస్టుల ప్రాబల్యం క్షీణదశకు చేరడంతో కేంద్ర పారామిలటరీ బలగాలైన సీఆర్‌పీఎఫ్‌ను అవసరమున్న చోటికి తరలించడానికి ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే కాటారం, మహాముత్తారం పోలీస్‌స్టేషన్ల ఆవరణలో ఉన్న క్యాంపుల్లోని వరంగల్ 58 బెటాలియన్ పరిధిలోని బీ, జీ కంపెనీకి చెందిన 200మందికి పైగా సీఆర్‌పీఎఫ్ బలగాలను మణిపూర్ రాష్ట్రానికి షిఫ్ట్ కావాలని ఆదేశాలొచ్చాయి. దీంతో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు సంజయ్‌కుమార్, రామకృష్ణ నేతృత్వంలోని సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు ఆదివారం మణిపూర్ వెళ్లనున్నారు. రెండు దశాబ్దాలకు పైగా అంకితభావంతో విధినిర్వహణలో పాల్గొనడంతో పాటు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలతో ప్రజల్లో మమేకమైన సీఆర్‌పీఎఫ్ బలగాలు సబ్ డివిజన్ నుంచి వెళ్లిపోతుండటంతో వారికి ప్రజలు, సివిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలకనున్నారు.

కన్న తండ్రినే కడతేర్చింది..

- ఆస్తి కోసం హత్య చేసిన కూతురు
- భర్తతో కలిసి కర్కశత్వం
- చితకబాదడంతో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి
- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 17: ఆస్తి కోసం ఓ తనయ తండ్రినే పొట్టన పెట్టుకుంది. కని పెంచిన ఆ తండ్రిపై కాసింత ప్రేమ కూడా చూపకుండా భర్తతో కలిసి ఈనెల 12న చితకబాదగా చికిత్స పొందుతూ ఆయన శనివారం మృతి చెందాడు. దీంతో పోలీసులు కుమార్తె, ఆమె భర్తతోపాటు వారికి సహకరించిన మరో నలుగురిని అరెస్టు చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్‌కాలనీలో ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బొమ్మన లచ్చిరెడ్డి(79) భూపాలపల్లిలోని కారల్‌మార్క్స్‌కాలనీలో నివసిస్తున్నాడు. సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైరైన ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రాజేశ్వరి, అల్లుడు జగన్మోహన్‌రెడ్డి భూపాలపల్లిలోని గాంధీనగర్‌లో, చిన్న కుమార్తె మల్లేశ్వరి, అల్లుడు లక్ష్మారెడ్డి కుందూరుపల్లిలో నివాసం ఉంటున్నారు. లచ్చిరెడ్డికి ఉన్న ఆస్తి విషయంలో ఆయనకు, ఇద్దరు కూతుళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద కుమార్తెకే తన ఆస్తినంతా రాసిస్తానని లచ్చిరెడ్డి అనేవాడు. దీంతో చిన్న కూతురు మల్లేశ్వరి తండ్రిపై కోపం పెంచుకుంది. తండ్రి అన్నంత పనిచేస్తే తనకేమీ మిగలదని భావించిన ఆమె ఎలాగైనా ఆయన్ను కడతేర్చాలని పథకం రచించింది. ఇందుకు తమకు పరిచయస్థులైన కాటారం మండలం బూడిదిపల్లికి చెందిన శనిగరం ముత్తయ్య, కాల్వల మహేష్, శనిగరం పులి రాజు, లింగాల శ్రీకృష్ణ సహాయం తీసుకుంది. పథకం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లచ్చిరెడ్డి (ఫైల్)

మిగతా 8వ పేజీలో...

జిల్లా కోర్టులో నియామకాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 17: భూపాలపల్లి జిల్లా కోర్టులో కాంట్రాక్టు ప్రాతిపాదికన రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు లీగల్ సర్వీస్ అథారిటీ ఛైర్మన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి, టైపింగ్‌తో పాటు ఇతర అర్హతలు ఉండాలని పేర్కొన్నారు. ఆఫీస్ ప్యూన్ ఉద్యోగానికి ఏడో తరగతి పాసై ఉండాలని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

18ఏళ్లు నిండిన వారిని ఓటరు జాబితాలో చేర్చాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 17: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని, బీఎల్వోలు ఈనెల 20 నుంచి ఇంటింటి సర్వే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర పాల్గొన్నారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 2025 జనవరి 1 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుజాబితాలో చోటు కల్పిస్తూ పకడ్బందీగా రూపొందించాలని అన్నారు. ఓటరు జాబితా నమోదు ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈనెల 20నుంచి అక్టోబరు 28 వరకు ప్రీరివిజన్ నిర్వహించి 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. ఈఏడాది నవంబరు 28వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. డిసెంబరు 24లోపు అభ్యంతరాలను, ఓటరు క్లెయిమ్‌లను పూర్తిస్థాయిలో పరిష్కరించి 2025 జనవరి 6న తుది జాబితా రూపొందించాలన్నారు. ఈనెల 20నుంచి అక్టోబరు 18వరకు బూత్‌స్థాయి అధికారులు పోలింగ్‌కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలని, అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి కొత్తవి అప్‌లోడ్ చేయాలని అన్నారు. ఓటరు జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరించాలని ఆదేశించారు. మరణించిన ఓటర్ల వివరాలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను జాబితా నుంచి ఫారం- 7 ద్వారా తొలగించాలన్నారు. 1,500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను క్రమబద్ధీకరణ చేయాలని, అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఓటరు జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, ఓటరుకార్డుపై ఉన్న పొరపాట్లను పరిష్కరించాలనని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఓటరు నమోదుకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గం వారీగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని, ఈ కార్యక్రమానికి సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 17 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం 1.75లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 2,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.

కాళేశ్వరంలో శనిత్రయోదశి పూజలు



కాళేశ్వరంలో శనిత్రయోదశి పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 17 : మహదేవపూర్ మండలంలోని పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఘనంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 4 గంటల నుంచి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి సన్నిధానంలో శనిత్రయోదశి పూజలు, నవగ్రహ పూజలను నిర్వహించారు. 494 నవగ్రహ పూజలు 90 కాలసర్ప దోష నివారణ పూజలు, 30 కుంకుమార్చనలు, 124 అభిషేకాలు జరిగాయి. దీంతో లడ్డూ ప్రసాదం ద్వారా ఆలయానికి ఒకే రోజు రూ.4 లక్షలు వచ్చిందని అధికారులు తెలిపారు.

కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 17: కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ములుగులో జంపాల రవీందర్ అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నటికైనా మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదని అన్నారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పనిచేసిందని ఆరోపించారు. పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై బీజేపీ దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేసిందని దుయ్యబట్టారు. కమ్యూనిస్టులు, లౌకికశక్తులతోనే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ సాధ్యమని పేర్కొన్నారు. రానున్నరోజుల్లో పార్టీ బలోపేతానికి సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాటుపడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అభివృద్ధిలో వెనుకబడిన ములుగు జిల్లాకు అధిక నిధులు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే గిరిజన విశ్వవిద్యాలయం పనులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 22 నుంచి 24 వరకు హనుమకొండలో జరిగే సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలకు నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, ఆచంట ప్రసాద్, ఎమ్డీ.అమ్జద్‌పాషా, ముత్యాల రాజు, బండి నర్సయ్య, ఇంజం కొమురయ్య, వడి సారయ్య, జక్కుల ఐలయ్య, మాతంగి శ్యాంసుందర్, ముత్తయ్య, రాజు, రవి, సాగర్, రాజేందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

నీటమునిగిన పంటలు



నీట మునిగిన పత్తి పంట

కాటారం, ఆగస్టు17: మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సుమారు 7 సెం.మీల వర్షాపాతం నమోదు కావడంతో పలు చోట్లా పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. వర్షం దాటికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేనులు నీటమునిగాయి. ఇప్పమాటు ఉప్పొంగడంతో వరి పొలాల్లోకి వరద చేరింది. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం వాగులు భారీ వర్షానికి పొంగిపొర్లాయి. పెద్దవాగు ఉప్పొంగడంతో దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్ పల్లి పరిధిలో పత్తి చేలల్లోకి వరద నీరు చేరడంతో మొక్కలు నీట మునిగాయి. భారీ వర్షంతో చెరువులు మరోసారి మత్తుళ్ల దుమకుతున్నాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని పంటలు నష్టపోయిన రైతులు కోరుతున్నారు.




హనుమకొండ నక్కలగుట్టలో జోస్ అలుక్కాస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అట్టహాసంగా 'జోస్ అలుక్కాస్' ప్రారంభం

కాళోజీ జంక్షన్, ఆగస్టు 17: బంగారు ఆభరణాల విక్రయాల్లో రిటైల్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన జోస్ అలుక్కాస్ హనుమకొండలోని నక్కలగుట్టలో సరికొత్త షోరూమ్‌ను శనివారం ప్రారంభించింది. షోరూమ్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొనగా, సినీ నటి కీర్తిసురేష్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వేడుకలో జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కా, పాల్ జే, అలుక్కా, జాన్ అలుక్కా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం నాటి నుంచి ఈ నెల 21 వరకు రూ.60వేల విలువైన బంగారు, వజ్రాభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రోత్సాహకంగా ఒక బంగారు నాణాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ఇంకా అదనంగా వజ్రాలపైన 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపైన 7 శాతం తగ్గింపును నిర్వాహకులు ప్రకటించారు. షోరూమ్‌లో ప్రతీ ఆభరణం కొనుగోలుతో ఒక బహుమతిని కూడా అందజేస్తున్నారు. అలాగే వివాహ ఆభరణాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపులు చేయనున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జోస్ అలుక్కా మాట్లాడుతూ.. షోరూమ్‌లో విస్తృతమైన, ఆకర్షణీయమైన కలెక్షన్లతో నింపినట్లు వివరించారు. కస్టమర్లు హాల్‌మార్కు కలిగిన పాత బంగారాన్ని కొత్త బంగారు ఆభరణాలతో మార్పిడి చేసుకొని వాటితో లభించే లాభాలను పొందాలన్నారు. ఇక్కడ బంగారం, వజ్రాలు, వెండి, ప్లాటినం, కలెక్షన్లు, ఆత్యాధునిక డిజైన్లు లభ్యమవుతాయని అన్నారు. కాగా,60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆరు ఎంజీ ఆస్టర్, కార్లు, గృహోపకరణాలు, బంగారునాణాలతో సహా సుమారు రూ.6కోట్ల బహుమతులను ప్రకటించింది.






'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ హరీష్‌కు జాతీయ అవార్డు



హనుమకొండ టౌన్, ఆగస్టు 17: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ -2024 పోటీల్లో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ వీరగోని హరీష్‌కు బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 500 ఎంట్రీలు రాగా, వీరగోని హరీష్ తీసిన వరం గల్ వేయిస్తంభాల ఆలయం ఫొటోకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా హరీష్‌ను 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, బ్యూరో చీఫ్ తడక రాజనారాయణ, తదితరులు అభినందించారు.



తయ్యం.. తత్తయ్యం..

చెక్కు చెదరని లంబాడాల కట్టు, బొట్టు నాడు తండాల సంప్రదాయం.. నేడదే ట్రెండ్

..హే.. బాపు బంజారులం..



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 17 : 'తయ్యం..తత్తయ్యం.. తయ్యం.. తత్తయ్యం... హే... బాపు బంజారులం..' ఈ జానపద గేయం తెలంగాణ ప్రతీ పల్లెలో మారుమోగుతూ ఉంటుంది. ప్రధానంగా గిరిజన ప్రాబల్య ప్రాంతాలతో పాటు గిరిజనేతర ప్రాంతాల్లోనూ జోష్ నింపే ఈ జానపద గేయాన్ని పాఠశాలలు, కళాశాలల వార్షికోత్సవాలే కాదు.. ప్రతీ కార్యక్రమంలోనూ ఈ సంప్రదాయ నృత్యం చేస్తూ కనిపిస్తుంటారు. బంజార సంప్రదాయ దుస్తులు ధరించిన పిల్లలు.. మహిళలు పాదం కదుపుతారు. అయితే ఇక్కడో ప్రత్యేకత ఉంది. వీరు ధరించే దుస్తులు, ఆభరణాలు పూర్వకాల బంజారాల సంప్రదాయానివే అయినా ప్రస్తుతం అవి నయా ట్రెండ్‌గా.. పార్టీవేర్ దుస్తులుగా మారిపోతున్నాయి. ఫ్యాషన్ షోలతో పాటు పార్టీల్లో ఈ అలంకరణలు, దుస్తులు అందరినీ అలరిస్తున్నాయి. ఇలా చెక్కుచెదరని బంజారా సంప్రదాయ వైభవంపై ఆదివారం ప్రత్యేక కథనం.

అనేక రంగులు.. హంగులు..

రంగురంగుల అద్దాల రవిక, అవే రంగులు.. నెత్తిన అద్దాలు పొదిగిన దుప్పట్టా లాంటి వస్త్రం, మణికట్టు నుంచి మోచేతివరకు ప్రత్యేకంగా తయారు చేసిన మందపాటి గాజులు, చెవ్వులకు పెద్దపెద్ద వెండి దిద్దులు..... మెడలో వెండి గొలుసులు....అదే స్థాయిలో పాత రూపాయి నాణేలతో తయారు చేసిన గొలుసులు ధరించడం లంబాడా మహిళల సోయగం. ఈ వేషధారణలో లంబాడా మహిళలు నడుస్తున్నా.. పాదం కదిపి ఆడినా గజ్జెల సవ్వడి శబ్దం వినసొంపుగా ఉంటుంది. ఇదంతా ఒకప్పటి మాటే. ఆధునిక పోకడల్లో కొంత మార్పు చోటు చేసుకున్నా.. మళ్లీ 'పాతకు సలాం' అంటూ ఈ సంప్రదాయ అలంకరణలు నయా ట్రెండ్‌గా మారుతున్నాయి. లంబాడా మహిళలు తమ సంప్రదాయ దుస్తులను ధరించి వివాహ, ఇతర వేడుకల్లో పాల్గొనడం మళ్లీ పెరుగుతోంది.

ఈ ట్రెండ్ వ్యాపారానికి డిమాండే...

లంబాడాల సంప్రదాయ దుస్తులు, అలంకరణ వస్తువులు ప్రత్యేకంగా తయారు చేసి విక్రయించే వ్యాపారానికి మళ్లీ డిమాండ్ వచ్చేస్తోంది. ఒకప్పుడు దుస్తులను పట్కారోలుగా వ్యవహరించే బీసీ వర్గానికి చెందిన కొందరు మాత్రమే తయారు చేసేవారు. నయా ట్రెండ్‌గా దీనికి మార్కెట్ పెరుగుతుండడంతో అన్నివర్గాల వారు ఈ దిశగా దుస్తుల తయారీకి ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల వార్షికోత్సవాలు, గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జానపద నృత్యాలు చేసే కళాబృందాలు, ఫ్యాషన్ షోల సందర్భంగా వీటికి గిరాకీ ఉంటోంది.

సంప్రదాయ దుస్తులివే..

ప్రధానంగా సంప్రదాయ దుస్తులు, వస్తువులో కాంఢ్లీ(జాకెట్), పాట (ముసుగు), కడపాలు, గాజులకు ముందు వేసే చలియా, బేగార్లు, వంకిడీలు, బలియాలు, కాంట్లీగుగ్గురా, చట్కియా (మట్టెలు), కస్సె, కాలిగజ్జెలు, గజ్జెల లాగులు లభిస్తున్నాయి.

దుస్తులు, రేట్లు....

కాంఢ్లీ జాకెట్లు రూ.1000, పాట రూ.450, కడపాప్లెన్ రూ.100, 12గాజులకు రూ.200, వాంకిడీ జత రూ.1000, కాంట్లీగుగ్గురా ఒక్కటికి రూ.20, చట్కియా (మట్టెలు) రూ.150, కస్సె జత రూ.800, కాలిగజ్జెలు జత రూ.800పైగా, గజ్జెల లాగులు రూ.2000, అంగూతర పెద్దవేలు మట్టెలు రూ.160 ఉన్నాయి.

ప్రోత్సహిస్తే మా కుటుంబాలకు జీవనోపాధి

ఎ. మదన్, లంబాడా గాజుల వ్యాపారి, మహబూబాబాద్



ఒకప్పుడు బాగానే నడిచిన లంబాడా గిరిజనులు సాంప్రదాయ దుస్తుల వాడకం క్రమంగా తగ్గింది. కానీ ఇప్పుడిప్పుడే కాస్త పుంజుకుంటోంది. అత్యధికంగా గిరిజనులు ఉండే మానుకోట ప్రాంతంలో ఒకప్పుడు 15 షాపుల్లో కేవలం గిరిజన సంప్రదాయ దుస్తులనే విక్రయించే వారు. రానురాను గిరిజన దుస్తులపై మోజు తగ్గడమో.. పాశ్చాత్య దుస్తులపై వ్యామోహం పెరగడమో గిరిజన సాంప్రదాయ దుస్తులను కొనుగోలు చేసే వారు తక్కువయ్యారు. అయినా ఇప్పుడు కొత్త ట్రెండ్‌గా ఈ దుస్తులను కోరుతూ.. రావడం మా వృత్తికి ఆశాజనకం. సంప్రదాయ దుస్తుల తయారీకి ప్రభుత్వం ప్రోత్సహిస్తే మా జీవనోపాధి మెరుగుపడుతుంది.

శైలజకు జేఎన్‌టీయూ డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 17: వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పోకల శైలజకు జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రొఫెసర్ గురురావు పర్యవేక్షణలో నావెల్ సెక్యూటర్ మల్టీ పాత్ రౌటింగ్ అల్గారిథమ్ ఫర్ మొబైల్ అడ్‌హక్ నెట్‌వర్క్ అనే అంశంపై శైలజ సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు జేఎన్‌టీయూ డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.





కోల్‌కతా ఘటనపై వైద్యుల నిరసన

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 17: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో మెడికల్‌షాపు యూనియన్, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్య విద్యార్థిని హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సూర్యతేజ, మెడికల్ షాపు యూనియన్ నాయకులు బచ్చు పూర్ణచందర్‌రావు, జయసింహ, రాంబాబు, అరుణ్, కోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్ (నూగూరు), చిట్యాలలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

- రేగొండ: పీజీ వైద్య విద్యార్థిని హత్యాచారానికి నిరసనగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విధులను బహిష్కరించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విష్ణువర్ధన్, అస్మా ఫాతిమా, సిబ్బంది దండె లింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
- కాటారం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్యకళాశాలలో వైద్యురాలి హత్యాచార సంఘటనను నిరసిస్తూ సాధారణ ఓపీ సేవలు నిలిపేశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైద్యులు తిరుపతి, వందన, ప్రియాంక, హెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, ఏఎన్ఎంలు మనోరమ, లక్ష్మి, పి.రజిత, పద్మావతి, జె.శ్యామల, కె.రజిత, సుజాత, కె.శ్యామల, సరళ, ఫార్మాసిస్ట్ రైసా, లలిత, హెచ్ఏలు సమ్మయ్య, రాజు, ఎల్‌టీ సాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- వాజేడు : వైద్య విద్యార్థిపై హత్యాచారం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలతో శనివారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ వైద్యులపై ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఘటనకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ వైద్యురాలు యోషిత, సిబ్బంది లఖన్, రజనీకాంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.
- మహదేవపూర్ : కోల్‌కతా వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గంట చంద్రశఖర్ తెలిపారు. ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై దారుణానన్ని ఒడగట్టారని, నిందితులను శిక్షించాలని అన్నారు.
- చిట్యాల 7: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందింతులను కఠినంగా శిక్షించాలని సామాజిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. భారత వైద్య సంఘం పిలుపు మేరకు శనివారం స్థానిక సామాజిక ఆస్పత్రి, ఒడితల పీహెచ్‌సీ వైద్యులు విధులను నిలిపివేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, డాక్టర్ అఖిల, డాక్టర్ ప్రశాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- టేకుమట్ల : వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలకత్తాలో వైద్య విద్యార్థిని పోస్టుమార్ట్ రిపోర్ట్ ఆధారంగా హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కసరవేణి కుమార్, సాద శ్రీనివాస్, విజయ్, ఆనందం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఏర్పాటు చేయాలి : బీజేపీ

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 17: ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఎస్పీ శబరీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ములుగులోని గాంధీ చౌక్ లేదా బస్టాండ్ సమీపంలో అతిపెద్ద జాతీయజెండా ఎప్పుడూ ఉండేలా ఏర్పాటు చేయా లన్నారు. దీంతో పౌరులు దేశభక్తిని అలవర్చుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు కృష్ణమూర్తి, నాయకులు రెడ్డి రంజిత్, భాను, ఇనుముల మహేష్ చాతరాజు విక్రాంత్, ప్రశాంత్, కుక్కల పవన్‌కళ్యాణ్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ శబరీశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నేతలు

పాపన్న జయంతిని విజయవంతం చేయాలి

మంగపేట, ఆగస్టు 17: సర్దార్ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను మంగపేటలోని తెలంగాణ సెంటర్ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఏజేన్సీ గౌడ హక్కుల సంఘం మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మంగపేటలో శనివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తెలంగాణ సెంటర్ వరకు గౌడ కులాస్థుల ర్యాలీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు పూజరి రాజు, భీముడుగౌడ్, సోమయ్యగౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' బిల్లులు చెల్లించాలని వినతి

గోవిందరావుపేట, ఆగస్టు 17: మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీపీజీఎస్) జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఎంపీడీవో జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వేసవిలో తీవ్రమైన ఎండలను లెక్కచేయకుండా కూలీలు ఉపాధిహామీ పనులు చేశారని, మూడునెలలు గడిచినా వారికి ఇప్పటి వరకు డబ్బులు చెల్లిం చకపోవడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా కూలీలకు డబ్బులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు చెరుకుల శ్రావణ్, గొంది నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీపీజీఎస్ నేతలు

రేషన్ డీలర్ ఆత్మహత్య



రాజేందర్ (ఫైల్)

మల్హర్, ఆగస్టు 17 : కుమారుడి అనారోగ్యం పట్ల ఆందోళన చెందిన రేషన్ డీలర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొయ్యూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండంలోని పాతరుద్రారం గ్రామానికి చెందిన నగరపు రాజేందర్(42) గ్రామంలో రేషన్ డీలర్‌గా పని చేస్తు న్నాడు. ఆయనకు భార్య లింగమ్మ, కుమారులు సిద్ధు, మణికంఠ ఉన్నారు. పెద్ద కుమారుడు సిద్ధుకు ప్రమాదం జరగ్గా రెండు నెలల క్రితం ఆపరేషన్ నిర్వహించారు. అయినా అతడి ఆరోగ్యం కుదట పడలేదు. చికిత్స కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన రాజేందర్ గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చారు. చికిత్స అందుతున్న క్రమంలోనే రాజేందర్ శని వారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అచ్చం రాఖీలా..



అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి. ఈ వేడుకను గుర్తు చేసేం దుకే అన్నట్టు భూపాలపల్లిలోని మంజూర్‌నగర్‌లో రాఖీ పుష్పం విరబూసింది. అచ్చం రాఖీలా ఉండే ఈ పుష్ప చూపరులను విశేషంగా ఆకటు కుంటోంది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి జిల్లా

పోడు పట్టాలు అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 17: జిల్లాలోని అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం ఆమె హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఆర్‌వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం 2005 డిసెంబరు 13 నాటికి సాగుచేస్తున్న గిరిజనులు, మూడుతరాల పాటు సాగుచేసిన గిరిజనేతరులకు పోడుభూముల పట్టాల పంపిణీకి అర్హులని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 2,30,735మంది రైతులను అర్హులుగా గుర్తించి 6,69,676 ఎకరాల అటవీ భూమి పట్టాలు పంపిణీ జరిగిందని అన్నారు. ఇప్పటి వరకు ఆమోదించిన ఆర్‌వోఎఫ్ఆర్ దరఖాస్తుల పట్టాలు లబ్ధిదారుడికి చేరాయోలేదో నివేదిక అందించాలని సూచించారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన పోడుపట్టాల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సాగు జరుగుతున్న అటవీ భూముల వివరాలతో కూడిన నివేదికను అటవీ, గిరిజన, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉంటే వారికి పట్టా పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. దరఖాస్తు తిరస్కరించేపక్షంలో దానికి కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ నివేదిక అందించాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం గతం నుంచి సాగుచేసుకుంటున్న అటవీభూములకు మాత్రమే పట్టాలు అందించాలని, కొత్తగా ఇంచు అటవీభూమి కూడా సాగు చేయడానికి వీలులేదని, అటవీభూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఆర్‌వోఎఫ్ఆర్ చట్టంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, గిరిజనులు, ఆదివాసీలకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని, వలస వచ్చి అటవీప్రాంతంలో చెట్లు నరికివేత చేయాలని చూస్తే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ గిరిజనులకు అటవీశాఖ వ్యతిరేకం అనే భావన తొలగించేలా పనిచేయాలన్నారు. కొత్తగా అడవుల నరికివేత జరగకుండా సంబంధిత శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూముల్లో స్మగ్లింగ్ జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్ పోడుభమల పట్టా దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని, ఆర్‌వోఎఫ్ఆర్ చట్ట ప్రకారం అర్హులందరికీ పట్టాలు అందజేయాలన్నారు. గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, ఆస్పత్రి వంటి మౌలిక వసతుల కల్పన పనులకు అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. పట్టాలు మంజూరు చేసిన పోడు భూముల్లో రైతులు పామాయిల్, జీడి, మామిడితోటలు సాగుచేసేలా అవసరమైన సహకారాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, డీడీ పోచం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

చిట్యాల, ఆగస్టు 17: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలన్లి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మం డల కేంద్రంలోని సామాజిక ఆస్ప త్రిని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10 గంట లకే ఆస్పత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీ లించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది అటెండెన్స్ తీసుకున్నారు. విధులకు హాజరుకాని సిబ్బందికి సీఎల్ వేశారు. ఆస్పత్రిలో శానిటేషన్ సరిగా లేదని, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఎక్కువ మొత్తంలో రక్త నమూనాలు సేకరించి టెస్టుల సంఖ్యను పెంచాలన్నారు. ఆస్పత్రి పరిధిలోని ఒడితల, టేకుమట్ల మండంలంలోని వెలిశాల, మొగుళ్లపల్లి, రేగొండ పీహెచ్‌సీల వైద్యసిబ్బందితో ప్రతి నెలా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గర్భిణుల వివరాలు సేకరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హేమ, ఇన్‌చార్జి సూపరిం టెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అఖిల, డాక్టర్ ప్రశాంతి, ఎంపీవో రామకృష్ణ ఆర్‌ఐ భాస్కర్ల రాజు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

మండల వ్యవసాయ అధికారి బదిలీ

కాటారం, ఆగస్టు 17: మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాటారం మండలానికి ఏవోగా ఉన్నతాధికారులు ఎవరినీ నియమించలేదు.

గుడుంబా నిర్మూలనకు సహకరించాలి

తాడ్వాయి, ఆగస్టు 17: మండలవ్యాప్తంగా గుడుంబా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహక రించాలని స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా గుడుంబా తయా రు చేస్తూ విక్రయిస్తున్నారని, దీంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. గుడుంబా నిర్మూలనకు మహిళలు, ఉద్యోగులు, యువతీ,యువకులు పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పోలీసులకు సమాచారం, సహకారం అందించినట్లయితే గుడుంబా రహిత మండలంగా ఏర్పాటు చేసేందుకు సాధ్యమవు తుందని అన్నారు. ఆయన వెంట సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతుల నిరసన

చిట్యాల, ఆగస్టు 17: స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు శనివారం నిరసనకు దిగారు. డీసీసీ బ్యాంకులో ఎలాంటి రుణాలు పొందకున్నా తీసుకున్నట్టు ఆన్‌లైన్‌లో నమోదై ఉందని, ఇది అన్యాయమని నిరసనకు దిగారు. రైతులు బుర్ర మురళి, పిట్ట కుమారస్వామి, ఐలయ్య, చేరి రవీందర్ తదితరులు సీఈవో మొగిలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ పదేళ్లుగా స్థానిక యూనియన్ బ్యాంకులో వ్యవసాయ రుణాలు తీసుకుంటున్నామని, రూ. 2లక్షల లోపు మాఫీ అవుతుందని ఆశతో ఎదురుచూస్తుండగా డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యంతో నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ జాబితాలో తమ పేరు లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించామన్నారు. రుణమాఫీ పత్రంలో యూనియన్ బ్యాంక్ రుణాలతో పాటు డీసీసీ బ్యాంకులో రుణాలు తీసుకున్నట్లు చూపుతోందన్నారు. రూ. 2 లక్షలపైగా అప్పు ఉందని అంటున్నారని, తమకు తెలియకుండానే తమ పేరుతో ఎవరు రుణాలు తీసుకు న్నారో తెలపాలని అధికారులను నిలదీశారు. పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. దీనిపై పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాల్లో కొన్ని తప్పులు చోటుచేసుకున్నాయని, ఈ రుణాల విషయంలోనూ పొరపాట్లు ఏవైనా జరిగి ఉంటే సరిచేస్తామని అన్నారు.



పీఏసీఎస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

కాటారంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

కాటారం, ఆగస్టు 17: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో శనివారం భారీగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జెన్‌కో సీఎస్ఆర్ నిధులను మంజూరు చేశారు. భారీ స్తంభాన్ని ఏర్పాటు చేసి మూడు వైపులా వెలుగులు విరజిమ్మేలా 11లైట్లను ఏర్పాటు చేశారు. దీనిని పంచాయతీ కార్యదర్శి సమీర్‌ఖాన్ దగ్గరుండి బిగింపజేసి లైట్లను ఆన్ చేశారు. కాగా గతంలో 353(సీ)జాతీయ రహదారిలో భాగంగా మండల కేంద్రంలో ని అంబేద్కర్ కూడలికి ఇరు వైపులా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ బిల్లులను అటు నేషనల్ హైవే అధికారులు, ఇటు జీపీ అధికారులు చెల్లించకపోవడంతో రూ.11లక్షల మేర బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని నెలలుగా లైట్లు వెలగని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'ఓపెన్' అడ్మిషన్లు ప్రారంభం

తాడ్వాయి, ఆగస్టు 17: ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, మండలంలోని యువతీ యువకులు ప్రవేశం పొందాలని మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల విభాగం ఇన్‌చార్జి లక్ష్మయ్య శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 18ఏళ్లు నిండి చదువు మధ్యలో మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492781687 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత

రేగొండ, ఆగస్టు 17: ఇటీవల అనారోగ్యంతో మరణించిన మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వంగ భాస్కర్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. మృతుడి భార్య శారద, ఇద్దరు పిల్లలను ఓదార్చి ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే బీఆర్ఎస్ నాయకుడు కొమురాజు కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ సర్పంచ్ దగ్గు సంధ్యారాణి, నాయకులు బండి రమేష్, కాంతాల నారాయణరెడ్డి, పసుల అశోక్ , బాపూరావు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పనిచేయాలి : డీఎస్పీ రవీందర్

గోవిందరావుపేట, ఆగస్టు 17: మండలంలోని యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పనిచేయాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వాలీబాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. యువత మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిలో చైతన్యం కలిగించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయిని నిర్మూలించడంలో యువత పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్, పీఈటీలు సురేందర్, ఆదినారాయణ, క్రీడాకారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్

వైద్యం కోసం ఎల్‌వోసీ అందజేత

కాటారం, ఆగస్టు 17: మండలంలోని దామెరకుంట గ్రామానికి చెందిన జంజర్ల రంజిత్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.75 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. రంజిత్ వెన్నెముకకు సంబంధించిన వ్యాధితో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యఖర్చుల నిమిత్తం సాయం అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన ఎల్‌వోసీ మంజూరు చేయించగా వ్యక్తిగత సహాయకుడు శనివారం అందజేశారు.

ఎస్సైకు బీజేపీ అధ్యక్షుడి సన్మానం

రేగొండ, ఆగస్టు 17: నూత నంగా బాధ్యతలు చేప ట్టిన ఎస్సై సందీప్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్ రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానిం చారు. శాంతిభద్రతల పరిరక్ష ణలో పూర్తి స్థాయిలో సహకరి స్తామని అన్నారు. ఎస్సైని కలి సిన వారిలో బీజేపీ పార్లమెంటరీ కోకన్వీర్ ప్రసాదరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి ఉన్నారు.

కళాశాలకు బస్సులు నడిపించాలి: ఎస్ఎఫ్ఐ

మంగపేట, ఆగస్టు 17 : స్థానిక జూనియర్ కళాశాలకు విద్యర్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. మంగపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కళాశాల విద్యార్థుకు బస్సు సర్వీసులు సమయానికి అందుబాటులో ఉండటం లేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతన్నారని తెలిపారు. ముఖ్యంగా రాజుపేట, చుంచుపల్లి, మల్లూరుకు చెందిన విద్యార్థులు మంగపేట కళాశాలకు రావడానికి సకాలంలో బస్సు సర్వీసులు ఉండటం లేదన్నారు. దీంతో చాలా మంది మధ్యలోనే చదువులు మానేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమండ్ చేశారు. ఈ సమావేశంలో ఎక్కడి సరోజన, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రంజిత్, కార్యదర్శిగా కిరణ్, ఉపాధ్యక్షుడిగా నిఖిల్‌తోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, ఆగస్టు 17: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా రోగాలు దరిచేరవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టరు అప్పయ్య అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన కొంగాలలో ఆయన శనివారం పర్యటించారు. ఇటీవల విషజ్వరంతో మృతిచెందిన బాలింత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను, గిరిజనుల ఇళ్లను పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిని పరిశీలించి దోమ లార్వా వృద్ధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జ్వరాలతో బాధపడుతున్న 20 మంది నుంచి రక్తనమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపించారు. ప్రతి మూడు రోజులకోసారి నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. అనంతరం గ్రామస్థులకు వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. దోమ తెరలు వాడాలని, సుస్తీగా అనిపిస్తే వైద్యశాలను సంప్రదించాలని అన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు మధుకర్, యోషిత, సిబ్బంది కోటిరెడ్డి, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

కన్న తండ్రినే కడతేర్చింది..

(5వ పేజీ తరువాయి)

ప్రకారం ఈనెల 12న ఆ నలుగురు వ్యక్తులు భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. లచ్చిరెడ్డిని కలిసి ఆస్తి విషయంలో చర్చించి.. మాయమాటలు చెప్పి కారులో బాంబులగడ్డకు తీసుకెళ్లారు. అక్కడ బాగా మద్యం తాగించి, ఆ మత్తులోనే మల్లేశ్వరి నివసించే కుందూరుపల్లికి తీసుకెళ్లారు. అక్కడికి చేరుకునే సరికి తేరుకున్న లచ్చిరెడ్డి కూతురి ఇంట్లోకి వెళ్లేందుకు ససేమిరా అన్నాడు. దీంతో కుమార్తె మల్లేశ్వరి కలగజేసుకొని భర్త లక్ష్మారెడ్డితో కలిసి తండ్రిని బలవంతంగా తన ఇంటి మేడపైకి తీసుకెళ్లింది. ఇద్దరూ కలిసి లక్ష్మారెడ్డిపై రాడ్డుతో దాడి చేసి చితకబాదారు. ఆ తర్వాత తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఎవరికీ అనుమానం రాకుండా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్లి.. మెట్ల పైనుంచి జారి పడటంతో గాయపడ్డాడని వైద్యులను నమ్మబలికారు. కానీ గాయాలు చూస్తే జారిపడ్డట్టుగా లేవని అనుమానించిన వైద్యులు పోలీసులకు సమాచారం అదించగా.. అక్కడికి చేరుకున్న పోలీసులకు లచ్చిరెడ్డి జరిగినదంతా వివరించాడు. అనంతరం పోలీసులు విచారణ ప్రారంభించగా.. లచ్చిరెడ్డి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో మృతుడి చిన్న కుమార్తె మల్లేశ్వరి, అమె భర్త లక్ష్మారెడ్డితో పాటు వారికి సహకరించిన శనిగరం ముత్తయ్య, కాల్వల మహేష్, శనిగరంపులి రాజు, లింగాల కృష్ణను అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారని, ఆ ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు.

జాతీయ అవార్డుకు ఎంపిక

మల్హర్, ఆగస్టు 17 : మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నృత్య కళాకారిణి బానోతు అలకనంద జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైంది. ఆర్యాణి సకల కళా వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య కళా పోటీల్లో ఆమె భరత నాట్యంలో గౌతమి నంది అవార్డు అందుకుంది. తన నృత్య ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టు కుని జాతీయ స్థాయి నాట్య సౌగంధిక పురస్కారానికి ఎంపికైంది. సెప్టెంబర్ 8న కరీంనగర్ ఫిలీం భవన్‌లో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదగా అవార్డు అందుకోనుంది.



బానోతు అలకనంద

సీహెచ్‌సీ సూపరిండెంట్‌ను సస్పెండ్ చేయాలి : నాయీబ్రాహ్మణ సంఘం

మల్హర్, ఆగస్టు 17 : పెద్దపల్లి జిల్లా మంథని సీహెచ్‌సీ సూపరిండెంట్‌ను సస్పెండ్ చేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయీబ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ అనంతరం ఉద్యోగుల సమక్షంలోనే కాంట్రాక్ట్ వర్కర్ పూర్ణిమతో సూపరింటెండ్ బూట్లు శుభ్రం చేయించుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి ఆయన్ను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో ఆందోళలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో నాయిబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు అడ్డూరి తిరుపతి, నరేష్, కుమార్, రమేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : యూటీఎఫ్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 17: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గిరిజన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ పోచంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న డీడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై గిరిజన ఉపాధ్యాయ సంఘాలతో మొదటగా సమన్వయ సమావేశం నిర్వహించాల్సి ఉండగా, దానిని విస్మరించారని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్యను చూపిం చలేదని, ఆన్‌లైన్‌లో కూడా పెట్టలేదని అన్నారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో సబ్జెక్టుల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను ఆన్‌లైన్‌లో చూపించారని అన్నారు. కానీ ఆన్‌లైన్‌లో చూపించిన అన్ని పోస్టులకూ పదోన్నతులు ఇవ్వకుండా కొందరికి మాత్రమే కల్పించారని విమర్శించారు. గిరిజన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరగలేదన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చెంచయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నేతల నిరసన